జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

బుధవారం | 11-2-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 589 పేజీలు: 4 వెల : రూ.7



# వారసుడొచ్చాడు!

**కొత్తూరు, ఫిబ్రవరి10 (వార్త):** ఉత్తరాంధ్ర రాజకీయాల్లో పాతపట్నం కోట మళ్లీ కంపిస్తోంది. నియోజకవర్గ గడ్డపై తమకు సాటిలేరని కలమట కుటుంబం మరోసారి గర్జించింది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, యువనేత కలమట సాగర్ జన్మదిన వేడుకలు కేవలం ఒక పుట్టినరోజు వేడుకలా కాకుండా, రాబోయే రాజకీయ తుఫానుకు సంకేతంగా నిలిచాయి. నివగాంలోని కలమట కార్యాలయానికి నియోజకవర్గంలోని ప్రతి పల్లె నుంచి వేలాదిగా జనం తరలిరావడంతో అదోక జనసంద్రంలా మారింది. ఈ వేడుకల్లో యువత నుంచి వచ్చిన భారీ స్పందన చూస్తుంటే, పాతపట్నం రాజకీయాల్లో భవిష్యత్ నాయకత్వంపై ఒక స్పష్టమైన క్లారిటీ వచ్చేసింది. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి, జిల్లా అధ్యక్షులు మొదలవలస రమేష్ సమక్షంలో జరిగిన ఈ వేడుకలు, వ్యూహకర్తలకు ఒక గట్టి హెచ్చరికను పంపాయి. సాగర్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు ఉరకలెత్తే ఉత్సాహంతో కనిపిస్తున్నాయి. వేడుకల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి తన రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా కుటుంబాన్ని రాజకీయంగా సమాధి చేయాలని చూస్తున్న శక్తులకు ఈ జనసందోహమే సమాధానం. మీ కుట్రలు మా ప్రజల మద్దతు ముందు గడ్డిపోచతో సమానం అని విమర్శించారు. సాగర్ ఇక నా కొడుకు మాత్రమే కాదు.. మీ ఇంటి బిడ్డ. మీ కష్టాల్లో తోడుండే సైనికుడు. పాతపట్నం అభివృద్ధిని అడ్డుకుంటున్న వారికి కాలం చెల్లింది. రాబోయే కాలం మనదే, అభివృద్ధి చేసేది మనమే అంటూ ఆయన మాట్లాడారు. అయితే సాధారణంగా జరిగే పుట్టినరోజు వేడుకలకు భిన్నంగా, నియోజకవర్గ స్థాయి బహిరంగ సభను తలపించేలా ఈ కార్యక్రమం జరగడం ఇప్పుడు పాతపట్నం నియోజకవర్గ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కలమట సాగర్ చుట్టూ ఉన్న యువబలం చూస్తుంటే, రాబోయే ఎన్నికల్లో పాతపట్నంలో భారీ మార్పులు ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి.. సాగర్ బర్త్‌డే వేడుకలతో పాతపట్నం రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

* సాగర్.. ఇక మీ ఇంటి బిడ్డ * కుట్రలు మాపై పనిచేయవు.. ప్రజలే మా బలం * ప్రత్యర్థులకు కలమట వెంకటరమణ స్ట్రాంగ్ వార్నింగ్
* ప్రజలు, అభిమానులు, కార్యకర్తల మధ్య సాగర్ జన్మదిన వేడుకలు
* సాగర్ పొలిటికల్ ఎంట్రీ





గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు

# ప్రత్యేక సోదాలు

* పోలీసు జాగిలాలతో తనిఖీలు
* వాహనాలు పరిశీలించిన పోలీసులు


**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి10 (వార్త):** జిల్లాలో గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ నిల్వలు, రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టే దిశగా జిల్లా పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతోంది. ఈ చర్యలలో భాగంగా మంగళవారం ఎచ్చెర్ల పోలీసు స్టేషన్ పరిధిలో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఎచ్చెర్ల పోలీసు స్టేషన్ ఎస్ఐ లక్ష్మణరావు నేతృత్వంలో పోలీసు సిబ్బంది, పోలీసు జాగిలం సహకారంతో చిలకపాలెం జంక్షన్, పొందూరు రహదారి మార్గం సహా పరిసర ప్రాంతాలతో పాటు అను మానాస్పద ప్రదేశాలు, ముఖ్య కూడళ్లు, దుకాణాలు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అదేవిధంగా విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో జిల్లా పోలీసులు ప్రతి వాహనాన్ని పరిశీలించారు. వాహన పత్రాలు పరిశీలించి సరైన పత్రాలు లేనివారికి, రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘించిన వారిపై జరిమానా విధించారు. అనుమానం ఉన్న ప్రయాణికుల లగేజీ బ్యాగులు, సరుకులను జాగ్రత్తగా పరిశీలించి గంజాయి సహా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వలను గుర్తించే దిశగా సోదాలు నిర్వహించారు. ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు అవకాశం లేకుండా నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.







# దేవదేవుడు.. వాసుదేవుడు

* కనులపండువగా బ్రహ్మోత్సవాలు * కల్పవృక్షవాహనంలో ఊరేగిన స్వామి
* వైభవంగా లక్ష్మీదేవి పూజ * నారాయణ మంత్రమే శ్రీరామరక్ష
* శ్రీత్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి



**మందస, ఫిబ్రవరి10(వార్త):** శ్రీవాసుదేవ పెరుమాళ్ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆలయం పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. శ్రీత్రిదండి దేవనాథరామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు, వేదపండితులు గోపినంబాళ్ల దాసూర్మాచార్యులతో పాటు వేదపండితులు మంత్రోచ్ఛాణలతో శాస్త్రోక్తంగా పూజలు చేస్తున్నారు. శ్రీత్రిదండి దేవనాథరామానుజ జీయర్ స్వామి





భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. సమస్త ప్రాణకోటికి మూలాధారం శ్రీమన్నారాయణుడేనని, నారాయణ మంత్రమే శ్రీరామరక్ష అని తెలిపారు. భగవత్సం కల్పముతో మానవజాతి ముందుకు వెళ్తోందని, ప్రతీ ఒక్కరూ శ్రీమన్నారాయణుడిని భక్తితో కొలవాలన్నారు. ఆధ్యాత్మిక చైతన్యంతోనే సామాజిక అభివృద్ధి చెందుతుందని, గోష్టులంతా కలసి నిర్వహిస్తే భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. భగవంతుని శరణుకోరడమే శరణాగతి అని అన్నారు. దేవుడు ఒక్కడే అని, ఏ రూపంలో కొలిచినా పలుకుతారని బోధించారు. ప్రతీ మనిషిలోను ఆధ్యాత్మిక చైతన్యం కలిగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు తప్పనిసరి అని అన్నారు.

## బ్రహ్మోత్సవాలకు భక్తుల తాకిడి

బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమా లను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. జిల్లా నుంచే కాకుండా ఒడిశా, విజయ నగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చిన వేలాది మంది భక్తజనులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## నేడు శ్రీవాసుదేవుని కల్యాణమహోత్సవం

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం శ్రీవాసుదేవుని కల్యాణ మహోత్సవం బుధవారం జరుగనుంది. కల్యాణంలో భక్తులు వేలసంఖ్యలో పాల్గొంటారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలారాధన, నివేదన, గోష్టి, యాగశాలలో ధ్వారతోరణ, ధ్వజకుంభారాధన, వేద విన్నపములు, చతుఃస్థానార్చన, విశేషహోమములు, పంచసూక్త, పరివార, ప్రాయశ్చిత్త హోమములు, నివేదన, నిత్యపూర్ణాహుతి, బలిహోరణ, శాత్తుమురై, శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రపారాయణం, ప్రసాదగోష్టి కార్యక్రమాలుంటాయి. ఉదయం 9 గంటలకు యాగశాలలో విశేష హోమములు, శ్రీవాసుదేవస్వామి కళ్యాణ మహోత్సవం, జీయర్స్వాముల మంగళాశాషనములు, 3గంటలకు సాంస్క తిక కార్యక్రమాలు, గరుఢవాహనసేవలో శ్రీభూసమేత శ్రీవాసుదేవ స్వామివారికి మందస పురవీధుల్లో తిరువీధుల మహోత్సవం కార్యక్రమాలు జరుగుతాయి.

# కాలువ పలకలు విరిగి ట్రాక్టర్ బోల్తా

**- చల్లవానిపేటలో తప్పిన పెను ప్రమాదం**

**జలుమూరు, ఫిబ్రవరి 10(వార్త):** చల్లవానిపేట ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న కాలువలపై అమర్చిన సిమెంటు పలకలు విరిగిపోవడంతో సోమవారం సాయంత్రం ఒక ట్రాక్టర్ బోల్తా పడింది. జలుమూరు నుంచి చల్లవానిపేటకు మట్టి లోడుతో వస్తున్న ట్రాక్టర్ కాలువపైగా వెళ్లే సమయంలో అకస్మాత్తుగా సిమెంటు పలకలు విరగడంతో ట్రాక్టర్‌తో పాటు ట్రాలీ కూడా పల్టీలు కొట్టాయి. ఈ ఘటనతో కొంతసేపు రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు.

అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని గ్రామస్తులు తెలిపారు. కాలువలపై ఉన్న సిమెంటు పలకలు దెబ్బతిన్న స్థితిలో ఉండటంతో ఇలాంటి ప్రమాదాలు పునరావృతమయ్యే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పలకలను మరమ్మతులు చేసి రహదారి భద్రతను కల్పించాలని వారు కోరుతున్నారు.



## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**జిల్లా బాలల రక్షణ అధికారి మల్లేశ్వరరావు**



**పలాస, ఫిబ్రవరి 10 (వార్త):** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా బాలల రక్షణ అధికారి డి. యం. మల్లేశ్వర రావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "బాల్య వివాహాలు నిర్మూలన" అనే అంశం పైన విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006 ప్రకారం 18 ఏళ్ల లోపు అమ్మాయిలు, 21 ఏళ్ల లోపు అబ్బాయిల వివాహాలు పూర్తిగా నిషేధమని చెప్పారు. ఈ వివాహాలు చేసినా, ప్రోత్సహించినా, నిర్వహించినా తల్లిదండ్రులు, సంరక్షకులు, పాల్గొన్న వారంతా నేరస్తులు అవుతారని హెచ్చరించారు. ఇవి కాగ్నిజబుల్, నాన్-బెయిలబుల్ నేరాలుగా పరిగణించబడతాయ ని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ అధికారి కె.వి.రమణ, బాలల రక్షాణ సంక్షేమ అధికారి సంస్థల కౌన్సిలర్ సీతారాములు, జిల్లా బాలల రక్షణ విభాగం కోఆర్డినేటర్ కె, మూలతి, సూపర్వైజర్ యు లత, జడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు వీర్రాజు, పీడీ పద్మాలోచన ,గ్రామ పెద్దలుకిక్కర ఢిల్లీరావు(కెడిఆర్), గ్రామ సర్పంచ్ తామాడ మదన్, ఎస్ఎంసి చైర్మన్ గర్తం తులసిరావు, ఎంపీఫ్ స్కూల్ చైర్మన్ ప్రతినిధి పోతనపల్లి చిరంజీవి, అంగన్వాడీ టీచర్ దానమ్మ, మీనాక్షి (ఆయా), సచివాలయం సిబ్బంది, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించాలి



**మందస, ఫిబ్రవరి 10(వార్త):** అంగన్ వాడీ కేంద్రాల్లో సిబ్బంది తప్పక సమయ పాలన పాటించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి పెద్దింటి అరుణ అన్నారు. మందస మండలంలోని మఖరజోల అంగన్ వాడీ కేంద్రాన్ని ఆమె మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిలబస్ ప్రకారం ప్రీ స్కూల్ జరగాలని, మెనూ ప్రకారం ఫుడ్ పెట్టాలని ఆదేశించారు. సెంటర్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, టైమింగ్స్ పాటించాలని 9గంటల నుంచి నాలుగు గంటల వరకు అంగన్ వాడీ కేంద్రంలోని ఉండవలెనని చెప్పారు. చక్కగా పని చేస్తూ.. మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్త లఖినాన ఉమాకుమారి, హెల్పర్ తెలుకుల చంద్రావతి పాల్గొన్నారు.

## వైద్య శిబిరంలో 300మందికి పరీక్షలు




**మందస, ఫిబ్రవరి 10(వార్త):** లోహరిబంద గ్రామంలో రాగోలు జేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 300మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జనరల్ చెకప్, బీపీ, షుగర్, ఎక్స్ రేలు, కేన్సర్ పై ప్రత్యేక మెమోగ్రాఫ్ స్కానింగ్, ఈసీజీ, 2ఎకో స్కానింగ్ టెస్టు లు చేశారు. మెడికల్ క్యాంప్ కు క్యాన్సర్ డాక్టర్స్ డాక్టర్ మానస, కిడ్నీ డాక్టర్ గౌరకల గిరిబాబు, గుండె డాక్టర్ డాక్టర్ విజయ్ కుమార్, ఏజీఎం బొడ్డాపు చిన్నారావు, జేమ్స్ హాస్పిటల్ మేనేజర్ రాపాక తిరుపతిరావుతో పాటు జేమ్స్ నుంచి 25మంది వైద్య సిబ్బంది హాజరయ్యారు. నర్తు శంకరరావు, గౌరకల పాపారావు ఆర్థిక సహాయంతో క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో బస్ లోని స్కానింగ్ రాపాక శేషగిరి, దాసరి తాతారావు, ధర్మాన దువ్వయ్య, అందాల మోహన రావును ప్రారంభించారు. గ్రామ పెద్దలు, యువకులు సహకరించి, విజయవంతం చేశారు.

## ఖాతాదారుల సేవలకు దూరమైన .. ఎస్‌బీఐ ఏటీఎం

**- చల్లవానిపేటలో వారాలుగా మూత...**

**-నగదు ఉపసంహరణకు ఇబ్బందులు**

**జలుమూరు, ఫిబ్రవరి 10(వార్త):** చల్లవానిపేటలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌కు సంబంధించిన ఏటీఎం ఖాతాదారుల సేవలకు దూరమైంది. గత కొన్ని వారాలుగా ఏటీఎంకు తాళాలు వేసి ఉండటంతో నగదు ఉపసంహరణకు వచ్చిన ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పరిధిలో ఏకైక ఏటీఎంగా ఉన్న ఈ యంత్రం పనిచేయకపోవడంతో అత్యవసర అవసరాల కోసం కూడా నగదు పొందలేని పరిస్థితి నెలకొందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధి లేని పరిస్థితుల్లో నేరుగా బ్యాంకు శాఖకు వెళ్లి నగదు తీసుకోవాల్సి వస్తుండటంతో సమయం, శ్రమ వృథా అవుతున్నాయని తెలిపారు. వృద్ధులు, మహిళలు, కూలీలు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఏటీఎం సేవలను పునఃప్రారంభించి ఖాతాదారులకు సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.




# భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్

**-516 అర్జీల స్వీకరణ**

**-తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించిన ఎమ్మెల్యే. మామిడి గోవిందరావు**



**పాతపట్నం, ఫిబ్రవరి 10(వార్త):** పాతపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో, టెక్కలి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.కృష్ణమూర్తి సమక్షంలో రెవెన్యూ భూ సమస్యల పరిష్కారమే మార్గంగా ప్రజాదర్బార్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ "ప్రజాదర్బార్"కు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల నుంచి 516 మంది రైతులు తమ భూ సంబంధిత సమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాలలో ఉన్న తప్పులు, భూ హద్దుల వివాదాలు తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పాసు పుస్తకాల్లోని తప్పులను సరిదిద్దు కునేందుకు ఈ "ప్రజాదర్బార్" ఎంతో ఉపయోగపడిందని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోవిందరావు మాట్లాడుతూ రైతుల భూ సమస్యలు పరిష్కారం కాకుండా వారి జీవనోపాధి మెరుగుపడదన్నారు. అర్హులైన రైతుకు న్యాయం జరిగేలా అధికారులతో సమన్వయం చేసి సమస్యలు పరిష్కరిస్తామని, ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలు చెప్పుకునే వేదికగా ప్రజా దర్బార్‌ను నిరంతరం కొనసాగిస్తామన్నారు. రెవెన్యూ అధికారులు వచ్చిన అర్జీలను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐదు మండలాల అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# జర్నలిస్టుల సమస్యలపై ఛలో విజయవాడ

**-అన్ని జిల్లాల్లో ఏపీడబ్ల్యుజేఎఫ్ నేతల పర్యటన**

**- శ్రీకాకుళంలో సన్నాహక సమావేశం**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 10 (వార్త):** అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజేఎఫ్) ఆధ్వర్యంలో ఛలో విజయవాడ కార్యక్రమం త్వరలో నిర్వహించనున్నట్టు ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, ఎనఏజే జాతీయ కార్యవర్గ సభ్యులు సత్తారు భాస్కరరావు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కృష్ణ, జి.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు సువ్వారి మురళీధర్, డి.ఆనందరావు, టి.భీమారావు, జి.నరసింగరావు, బి.వాసుదేవరావు, వై.తవిటయ్య తదితరులు ప్రకటన విడుదల చేశారు. ఛలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఏపీడబ్ల్యుజేఎఫ్ వ్యవస్థాపకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, ఎనఏజే జాతీయ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, రాష్ట్ర నాయకులు పి.నారాయణతో పాటు పలువురు నేతలు ఈ నెల 11న జిల్లాకు రానున్నట్టు వారు తెలిపారు. 11న ఉదయం 10.30 గంటలకు శ్రీకాకుళం ఎన్‌జీవో హోంలో ఏపీడబ్ల్యుజేఎఫ్ జిల్లా కార్యవర్గ ప్రతినిధులు, జర్నలిస్టులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఏపీడబ్ల్యుజేఎఫ్ ఆఫీస్‌బేరర్లు, సభ్యులు, జర్నలిస్టులు హాజరుకావాలని కొంక్యాన వేణుగోపాల్, సత్తారు భాస్కరరావు, ఎస్.కృష్ణ, జి.లక్ష్మణరావు హాజరుకావాలని కోరారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపు, మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టులకు పింఛను, దాడులు నియంత్రణకు కమిటీ ఏర్పాటు, మీడియా అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు, జర్నలిస్టులకు అవార్డులు, కార్మిక భీమా, ఆరోగ్యభీమా ఏర్పాటుపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

# వెంకటేష్‌ను కబలించిన కిడ్నీ మహమ్మారి

**-కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు**

**మందస, ఫిబ్రవరి 10(వార్త):** ఉద్దానాన్ని అతలాకుతం చేస్తున్న కిడ్నీ మహమ్మారి మైదాన ప్రాంతాలకు కూడా విస్తరిస్తోంది.. ఎన్నో ఆశలు పెట్టుకున్న ఓ యువకుడిని అర్థాంతరంగా కిడ్నీ భూతం మింగేసింది. పాపం.. ఆ తల్లిదండ్రులు ఆయన పెట్టుకున్న ఆశలను అడియాశలను చేసింది. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని ముకుందపురం గ్రామానికి చెందిన రోకళ్ల నారాయణ, రాజేశ్వరి దంపతులకు వెంకటేశ్ అనే కుమారుడు ఉన్నాడు. ఎంతో కష్టపడి కుమారుడు వెంకటేశ్ ను బీటెక్(సివిల్) వరకు చదివించారు.. కుమారుడు ప్రయోజకుడై కుటుంబాన్ని ఉద్ధరిస్తాడని ఆశలు పెట్టుకున్నారు. కానీ, వెంకటేశ్ అనారోగ్యానికి గురయ్యారు. కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న ఆయనను డయాలసిస్ వరకు పరిస్థితి చేరుకుంది. తల్లిదండ్రులు అన్ని తామై వైద్య సహయం అందజేశారు. పలాసలోని కిడ్నీ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న వెంకటేశ్ హటాత్తుగా మరణించారు. దీంతో తల్లిదండ్రులు రోకళ్ల నారాయణ, రాజేశ్వరి రోదనను ఎవరూ ఆపలేకపోతున్నారు. ఒక్కగానొక్క కుమారుడు మరణించడంతో ఆ కుటుంబం యావత్తూ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. కిడ్నీవ్యాధి మరణాలు ఉద్దానం నుంచి ఈ ప్రాంతానికి వ్యాపిస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.



# మెడికవర్‌లో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 10 (వార్త):** లావేరు మండలం గురుగుబెల్లి గ్రామానికి చెందిన బి.సత్యారావు(44) కొన్ని నెలలుగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. తక్కువ హిమోగ్లోబిన్ (6 గ్రా.), ప్లేట్లెట్ సంఖ్య (కేవలం 20,000) కారణంగా శారీరకంగా బలహీనత, అలసట, ఇతర సంబంధిత సమస్యలతో చాలా రోజులుగా బాధపడుతున్నారు. దీంతో ఆయన , శ్రీకాకుళం నందు మెడికవర్ హాస్పిటల్ సర్జికల్ గాస్ట్రో ఎంటరాలజిస్ట్ డా. శ్యామ్ ప్రసాద్ వంశీ, జనరల్ సర్జన్ డా.మనోజ్‌ను సంప్రదించారు. పూర్తి పరీక్షల్లో ప్లీహ (స్ప్లీన్) అసాధారణంగా పెరిగి 45 సెం.మీ. (సాధారణ పరిమాణం 10 సెం.మీ.)కి చేరినట్టు తేలింది. దీనిని వైద్య పరి భాషలో "మాసివ్ స్ప్లీనోమెగలీ" అంటారు. ఇంత భారీ ప్లీహను సాధారణంగా ఓపెన్ శస్త్రచికిత్స ద్వారానే తొలగిస్తారు. కానీ జిల్లాలో మొదటిసారిగా, 4 గంటల పాటు కొనసాగిన ల్యాపరోస్కోపిక్ శస్త్రచికిత్స ద్వారా ఈ భారీ ప్లీహను విజయవంతంగా తొలగించారు. శస్త్రచికిత్స తరువాత కేవలం కొన్ని రోజుల్లోనే రోగి హిమోగ్లోబిన్ స్థాయి 12 గ్రా.కి, ప్లేట్లెట్ సంఖ్య 2.5 లక్షలకు పెరిగింది. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడడంతో సత్యారావు.. డా. శ్యామ్ ప్రసాద్ వంశీ, డా. మనోజ్, మెడికవర్ హాస్పిటల్ వైద్య బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## రుణాలు రెన్యువల్ చేసుకోవాలి




**జి.సిగడాం, ఫిబ్రవరి 10(వార్త):** జి.సిగడాం పీఎసీఎస్ సొసైటీలో రైతులు తీసుకున్న పంట రుణాలను తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని పిఎసిఎస్ చైర్మన్ బెవర జగన్నాథరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులు 7 శాతం వడ్డీ చెల్లించి సొసైటీకి వచ్చి రుణాలను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అయితే నిర్ణీత గడువులోగా రెన్యువల్ చేయని పక్షంలో 13 శాతం అపరాధ వడ్డీతో పాటు అసలు మొత్తాన్ని కూడా చెల్లించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రుణాల రెన్యువల్ కోసం రైతులు 1బి, ఆధార్ కార్డు మొబైల్ నెంబర్ తీసుకువచ్చి జి.సిగడాం పీఎసీఎస్ సొసైటిని సంప్రదించాలని చైర్మన్ కోరారు. వారితో పున్నాం సర్పంచ్ సుంకరి అప్పన్న,సీఈఒ కె. చిన్నారావు, కోటేశ్వరరావు, రైతులు ఉన్నారు.

## అలరించిన అన్నమయ్య కీర్తనలు, నృత్యాలు




**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 10(వార్త):** తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీనివాస కళ్యాణం ప్రాజెక్ట్ శ్రీనివాస కళ్యాణోత్సవంలో భాగంగా టి బరంపురం గ్రామంలో ఇచ్ఛాపురానికి చెందిన వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ అధ్యక్షులు చిన్నా గురు స్వామి భజన బృందం చక్కటి అన్నమయ్య కీర్తనలు ముందుగా ప్రారంభించి రాత్రి 8 గంటలకు అకాడమీ చిన్నారులచే చక్కటి కూచిపూడి నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం నుండి వచ్చిన వేద పండితుల బృందం చే పెద్దలచే కళాకారులకు సత్కార కార్యక్రమం జరిగింది.

## రైతులకు సాంకేతిక వ్యవసాయంపై అవగాహన

**-చిక్కాలవలస, బొరిగివలస ఆర్‌బీకేల పరిధిలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం**

**నరసన్నపేట, ఫిబ్రవరి 10(వార్త):** చిక్కాలవలస, బొరిగివలస రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో సూర్యకుమారి పాల్గొని రైతులకు వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎరువుల సమతుల్య వినియోగం, అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట మార్పిడి ప్రాధాన్యత తదితర అంశాలను రైతులకు వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సరిగ్గా వినియోగిస్తే ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరుగుతాయని సూచించారు. రైతులు ప్రభుత్వ వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకొని లాభదాయక వ్యవసాయం దిశగా ముందుకు సాగాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# నేడు మందస పోస్టాఫీసు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



**మందస, ఫిబ్రవరి 10(వార్త):** శ్రీవాసుదేవుని బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఈనెల 11న మందస పోస్టాఫీసు తరుపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పోస్టు మాస్టర్ దాసరి భాస్కరరావు చెప్పారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. దాహార్తితో ఉన్న భక్తులకు మంచినీరు, మజ్జిగ అందజేస్తామన్నారు. అదేవిధంగా ఆకలితో ఉన్న వారికి బిస్కట్లు, పులిహోర, తేనీరు అందివ్వబడతాయన్నారు. మందస పోస్టాఫీసు కార్యాలయం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఆమె పాలిట దేవత

## -విద్యార్థినికి కంటి చూపు తెప్పించిన ఉపాధ్యాయుని

## - మనసున్న మా రాణి 'సంధ్యారాణి'





**పలాస, ఫిబ్రవరి 10 (వార్త):** సూదికొండ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని సమీరకు కంటిచూపు తెప్పించేందుకు శస్త్రచికిత్స చేయించి ఉపాధ్యాయిని సంధ్యారాణి మనుస్ను మా రాణిగా నలిచారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధిలో గల సూదికొండ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న సమీరా అనే విద్యార్థి చిన్నప్పుడు నుండి కంటిచూపు సమస్యతో బాధపడుతూ పాఠశాలకు వస్తుండేది. ఆ విషయాన్ని గమనించిన పాఠశాల ఉపాధ్యాయిని తమ్మినాన సంధ్యారాణి విద్యార్థిని కంటిచూపులో పడుతున్న ఇబ్బంది గమనించి, ఈ విషయమై అమ్మాయి తల్లిదండ్రులను సంప్రదించి వివరాల్ని అడిగి తెలుసుకుంది. చిన్నతనం నుంచి కంటిచూపు సమస్య ఉన్నప్పటికీ పేదరికం కారణంగా శస్త్రచికిత్స చేయలేని పరిస్థితిని ఆ తల్లిదండ్రులు ఉన్నారు. సమీరా తండ్రి కిడ్నీ వ్యాధితో డయాలసిస్ చేయించుకుంటుండగా, తల్లి దినసరి కార్మికురాలుగా ఉన్న కుటుంబానికి సాయం చేయాలని, భావించిన సంధ్యరాణి, తన భర్త ఉపాధ్యాయుడు కేవీవీఎస్ ప్రసాదరావుకు వివరించింది. ఆయన పలువురు డాక్టర్లును సంప్రదించి సమీరా చికిత్స ఖరీదైనప్పటికీ, తక్కువ ఖర్చుతో చేసేందుకు వారిని అంగీకరింపజేసి కొంత మొత్తాన్ని సైతం తాను కూడా చెల్లించి, నేరుగా ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సూది కొండ పాఠశాల సిబ్బంది విద్యాశాఖ అధికారులును సంప్రదించి అనంతరం అనుమతి తీసుకుని తానే స్వయంగా సమీరాను విశాఖపట్నం హాస్పిటల్ తీసుకెళ్లి తన అనుకున్న లక్ష్యాన్ని నెరవేరేందుకు అహర్నిశలు కృషి చేసింది.

విశాఖపట్నంలో గల విశాఖ ఐ హాస్పిటల్ నందు డాక్టర్ గోపాల రాజు ఆధ్వర్యంలో కంటివైద్య బృందంతో శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. పట్టు వదలని ఆమె ప్రయత్నం ఆ చిన్నారి కంటికి వెలుగును ప్రసాదించేలా చేసింది. కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగి ఆర్థికంగా సాయపడటం సర్వసాధారణం.

కానీ చివరి దాకా వెన్నంటి నిలవడం గొప్ప విషయం కదా పలువురు ప్రశంసిస్తున్నారు. విలువలు చెప్పిన మనం ఆచరణలో కూడా చూపించడమే కదా! అసలైన మానవత్వం చూపించిన హ్యాట్సాఫ్ "సంధ్యారాణి టీచర్ అని కొనియాడారు. విద్యార్థిని పరిస్థితి అర్థం చేసుకొని దాతలు ముందుకు రావాలని పాఠశాల సిబ్బంది కోరుతున్నారు.



## పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కృషి చేయాలి

### -లింగాలవలస జెడ్పీ హైస్కూల్‌లో యాక్షన్ ప్లాన్, విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించిన డీఈఓ రవిబాబు



**జలుమూరు, ఫిబ్రవరి 10(వార్త):** పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి శతశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రవిబాబు సూచించారు. మంగళవారం జలుమూరు మండలం లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలులో ఉన్న యాక్షన్ ప్లాన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ, విద్యార్థుల అభ్యాసంలో నాణ్యత పెంపునకు విద్యాశాఖ నిర్దేశించిన నిబంధనలను ఉపాధ్యాయులు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. పరీక్షలకు విద్యార్థులను సమగ్రంగా సిద్ధం చేయడంలో ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ తీసుకొని ప్రత్యేక తరగతులు, పాఠ్యాంశాల పునశ్చరణపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సామర్థ్యాన్ని వివిధ అంశాలపై పరీక్షించారు. ప్రతి విద్యార్థి ఉత్తమ మార్కులు సాధించేలా లక్ష్య నిర్దేశనం చేసుకోవాలని సూచిస్తూ, శతశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా పరిశీలించి భోజన నాణ్యత, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మాధవరావు, ప్రసాద్ రావుల, నిర్మలాదేవితో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీముఖలింగం ఉత్సవాలకు 'కంట్రోల్ రూమ్'

- ❋ డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా పరిశీలన
- ❋ 18న చక్రతీర్థ యాత్రకు ప్రాధాన్యం
- ❋ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 10 (వార్త):** శ్రీముఖలింగం క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా 'కంట్రోల్ రూమ్' ఏర్పాటు చేశామని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన తుది ఏర్పాట్ల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల సమయంలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్ కేంద్రంగా పనిచేస్తుందని కలెక్టర్ తెలిపారు. 'కంట్రోల్ రూమ్‌లో ప్రతి లైన్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి సిబ్బంది విధుల్లో ఉంటారు. తమకు కేటాయించిన విభాగాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును వీరు నిరంతరం పర్యవేక్షిస్తుండాలి. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినా, భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చినా వెనువెంటనే స్పందించాలి' అని స్పష్టం చేశారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసులకు చెందిన ప్రతినిధులు కంట్రోల్ రూమ్‌లో ఉండి క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తుల రద్దీని బట్టి క్యూలైన్ల క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ మళ్లింపు వంటి అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలన్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా వచ్చే దృశ్యాలను కంట్రోల్ రూమ్ నుంచి నిశితంగా పరిశీలిస్తూ భద్రతను పటిష్టం చేయాలని ఏఎస్పీకి సూచించారు. వేడుకల్లో భాగంగా.. 18వ తేదీన జరిగే చక్రతీర్థ యాత్రకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పార్కింగ్ స్థలాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మరోసారి హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఏఎస్పీ కేవీ రమణ, టెక్కలి డిఎస్పి లక్ష్మణరావు, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీముఖలింగం వేడుకలకు వైద్యుల విరాళం

శ్రీముఖలింగం మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నరసన్నపేట ప్రైవేట్ వైద్యులు తమ వంతు సహాయంగా రూ. 1,60,000 విరాళాన్ని సేకరించి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు మంగళవారం అందజేశారు. ఈ విరాళం అందించిన వారిలో డా.బలగ మురళి రూ.20వేలు, డా.పొన్నాడ గణేష్, డా.తాడేల శ్రీకాంత్, డా.బలగ రమణారావు, అమృత, డా.బోర సాయిరామ్, డా.రాజేంద్ర, కిరణ్ మాధురి, డా.అనిల్, కృషి, డా.పొన్నాన గురునాథం, డా.రెడ్డి సంధ్య తలో రూ.10వేలు చొప్పున ఇచ్చారు. అలాగే డా.పాగోటి శంకర్, డా.సూరాపు కృష్ణారావు, సుధారాణి, డా.మెండ ప్రవీణ్, పద్మావతి, డా.తర్రా సురేష్, డా.బల్కా నవీన్, డా.రెడ్డి భార్గవ్, డా.బలగ రమేష్ తలో రూ.5వేలు, డా.గురుదేవ్ రూ.3వేలు, డా.ప్రకాష్ రూ.2వేలు తమ వంతు సహాయం అందించారు. భక్తుల సౌకర్యార్థం వైద్యులు సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డి.సి.హెచ్.ఎస్ డా.కళ్యాణ్ బాబుతో పాటు వైద్యులు గణేశ్వరరావు, మురళి బలగ, భార్గవ్, శంకర్ రావు పాల్గొన్నారు.

## నేడు శ్రీనివాస కళ్యాణ మహోత్సవం

**శ్రీకాకుళం,ఫిబ్రవరి10(వార్త):** శ్రీనివాస కళ్యాణ మహోత్సవాన్ని టీటీడీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ మైదానంలో ఏర్పాటు చేస్తున్నామని టీటీడీ కార్యాలయం సూపరింటెండెంట్ క్రాంతి కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులను భక్తుల చెంతకే చేర్చాలనే సదుద్దేశంతో, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తిరుమల క్షేత్రం నుండి వేద పండితులు, అర్చక స్వాములు ఈ కళ్యాణోత్సవాన్ని జరిపిస్తారని తెలిపారు. ఈ కళ్యాణోత్సవానికి ప్రవేశం ఉచితమన్నారు. ఈ సమావేశంలో టిటిడి కళ్యాణ ప్రాజెక్టు సూపరింటెండెంట్ హరికృష్ణ, కళ్యాణ వెంకటేశ్వర ఆలయం అధికారి బి.నాగేశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ శ్యామ్ సుందర్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

❋ శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

**గార, ఫిబ్రవరి10(వార్త):** మహిళలు స్వయంకృషితో అభివృద్ధి చెందుతూ ఆర్థికంగా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. గార మండలం మొగదాలపాడు గ్రామంలో నాబార్డ్ ఆర్థిక సహకారంతో, జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 15 రోజుల మత్స్య ఉత్పత్తుల విలువల జోడింపు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మహిళలను స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు ఇటువంటి శిక్షణలు దోహదపడతాయని తెలిపారు. ముఖ్యంగా మొగదాలపాడు బీచ్‌కు వచ్చే పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని, నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా మంచి లాభాలు గడించవచ్చని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు వ్యక్తిగతంగా లేదా గ్రూపులుగా ఏర్పడి వ్యాపారం ప్రారంభించేందుకు బ్యాంకుల ద్వారా తగిన రుణ సదుపాయం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. శిక్షణ కాలంలో ప్రతిరోజూ రూ. 50 ప్రోత్సాహకం కూడా అందజేస్తామని వెల్లడించారు. 30 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ 15 రోజుల్లో రెడీ-టు-కుక్ పద్ధతిలో చేపలు, రొయ్యల పచ్చళ్లు, చేపల ఫిల్లెట్లు, నగెట్స్ తయారీ, ఉత్పత్తుల ప్యాకేజింగ్, బ్రాండింగ్, ఫుడ్ సర్టిఫికేట్ పొందే విధానంపై శిక్షణ ఇవ్వనున్నారు. నాబార్డ్ డీడీఎం రమేష్ కృష్ణ మాట్లాడుతూ.. ఆధునిక పద్ధతుల్లో తయారు చేసిన మత్స్య ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. మహిళా మార్ట్‌లు, ప్రదర్శనల ద్వారా వీటిని విక్రయించడం వల్ల మహిళలు నెలకు రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు అదనపు ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ డీపీఎం నారాయణరావు, ఏపీఎంలు, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ..

# భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

### - కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించిన ఆలయ ప్రధాన అర్చకులు



**జలుమూరు, ఫిబ్రవరి 10(వార్త):** దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి ఏడాది ఎదురయ్యే ప్రధాన సమస్యలను ఈ సంవత్సరమైనా సమగ్రంగా పరిశీలించి సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నాయుడుగారి రాజశేఖర్ మాట్లాడుతూ, ఆలయానికి ఆనుకుని ఉన్న ఏకైక దక్షిణ ద్వారం గుండా వీఐపీలని చెప్పుకుంటూ కొందరు గర్భాలయంలోకి ప్రవేశం చేయటం వల్ల ఒక్కసారిగా తొక్కిసలాట జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మొదటి రోజు జాగరణ సమయంలో జరిగే లింగోద్భవ కార్యక్రమంలో శాశ్వత ధర్మకర్త మహారాణి కళ్యాణి గజపతి రాక సందర్భంగా పూర్వ క్షేత్ర నిబంధనలకు విరుద్ధంగా గుంపులుగా అంతరాలయ ప్రవేశాలు జరగటం ప్రమాదకర పరిస్థితులకు దారి తీస్తోందన్నారు. అలాగే ఉత్సవాల చివరి ఘట్టంగా జరిగే చక్రతీర్థ స్నానాలకు వేలాది మంది భక్తులు వెళ్లే రహదారి ఇరుకుగా ఉండటంతో ప్రమాదాల అవకాశాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. అంతేకాక చక్రతీర్థ స్నానాల అనంతరం మహిళలు దుస్తులు మార్చుకునేందుకు అవసరమైన గుడారాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ప్రధాన సమస్యలు ఈ సంవత్సరం పునరావృతం కాకుండా భక్తుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని కోరినట్లు ఆయన తెలిపారు.

# రోడ్డు ప్రమాదాలు నివారించండి

### -మున్సిపల్ కమిషనర్‌ని కోరిన ఓబీసీ మోర్చా నాయకులు



**పలాస, ఫిబ్రవరి 10 (వార్త):** రోడ్లపై ప్రమాదాలు నివారించాలని శ్రీకాకుళం జిల్లా భారతీయ జనతా ఓబీసీ మోర్చా అధ్యక్షులు లక్కోజు ధర్మారావు నేతృత్వంలో ఓబీసీ మోర్చా నాయకులు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కమిషనర్ ఐ శ్రీనివాసరావుని మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించుకున్నారు.

కాశీబుగ్గలోని అటల్ బిహారి వాజపేయి విగ్రహానికి రక్షణ బౌండరీ ఏర్పాటు చేయమని కోరారు. ప్రభుత్వ నిధులతో నిర్మాణాన్ని పూర్తిచేస్తామని కమిషనర్ ఐ శ్రీనివాస్ తెలిపినట్లు ధర్మారావు తెలిపారు. కొందరు గోయజమానులు రోడ్లపై ఆవులను వదిలివేయడం వల్ల తరచూ గోవులకు, ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలు ఏర్పడుతున్నాయని, వీధికుక్కల బెడద కూడా మరో సమస్యగా మారిందని, వీటిపట్ల దృష్టి సరించి గోరక్షణతో పాటు కుక్కల వల్ల చిన్నారులకు ప్రమాదాలు జరగకుండా చూడాలని కమిషనర్ ని కోరారు. సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి బూర్జిపేట హరికృష్ణ, కోశాధికారి వాసుపల్లి భాస్కరరావు, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి బోండా శ్రీనివాసరావు, ఓబీసీ నాయకులు సకలాబత్తుల షణ్ముఖరావు, యాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు హనుమంతు మురళీమోహన్ దొర, వీరగట్టపు వెంకటరావు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 10(వార్త):** ఇచ్ఛాపురం మండలం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ సూచించారు. మండలంలో మొత్తం 7,070 మంది రైతులు లో నమోదు అయ్యారని చెప్పారు. ఇది ప్రభుత్వ పథకాల అమలులో రైతుల భాగస్వామ్యం పెరుగుతున్నదానికి నిదర్శనంగా అధికారులు తెలిపారు. రిజిస్ట్రేషన్ కలిగి ఉండటం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం-కిసాన్, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఈపంట నమోదు, విత్తనాలు, ఎరువులు, రాయితీలు వంటి అన్ని వ్యవసాయ సంక్షేమ పథకాలను ఒకే ఐడీ ద్వారా సులభంగా పొంద వచ్చు నని రైతుల భూమి వివరాలు, పంటల సమాచారం డిజిటల్‌గా నమోదు కావడం వల్ల పథకాల పంపిణీలో పారదర్శకత పెరిగి, అర్హులైన రైతులకు ప్రయోజనాలు నేరుగా చేరుతాయని అన్నారు. ప్రతి రైతు తమ ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, భూమి పత్రాలతో సమీప రైతు సేవా కేంద్రం లేదా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు. ఇప్పటికే నమోదు అయిన రైతులు తమ వివరాలు సరిగా ఉన్నాయా లేదో పరిశీలించుకోవాలని, అవసరమైతే సవరణలు చేయించుకోవాలని సూచించారు. ఇంకా నమోదు కాని రైతులు ఆలస్యం చేయకుండా వెంటనే నమోదు చేసుకొని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలని కోరారు.



## అలంకార ప్రాయంగా జలజీవన్ మిషన్ ట్యాంకులు

### -సారవకోట మండలంలో అసంపూర్తి నిర్మాణాలతో తాగునీటికి ఇబ్బందులు



**సారవకోట, ఫిబ్రవరి 10(వార్త):** సారవకోట మండలంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామాల్లో నిర్మించాల్సిన వాటర్ ట్యాంకులు ప్రస్తుతం అలంకార ప్రాయంగా మారాయి. సారవకోట, సింగంవలస, శివరాం పురం, గోపాలపురం తదితర గ్రామాల్లో నిర్మించిన ట్యాంకులు అసంపూర్తి దశలోనే నిలిచిపోయి తాగునీటి సరఫరాకు ఉపయోగపడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకం కింద గ్రామీణులకు నిత్య తాగునీరు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన ఈ ట్యాంకుల నిర్మాణాల్లో ఇప్పటివరకు ఒక్కటైనా పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చిన దాఖలాలు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతున్నట్టు స్థానికుల వాదన. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి సమస్యలు మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న ట్యాంకుల నిర్మాణాలను పూర్తి చేసి జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రజలకు నిజమైన అర్థంలో అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

## వైసీపీ అనుబంధ కమిటీల సమావేశం

**నరసన్నపేట, ఫిబ్రవరి 10(వార్త):** నరసన్నపేట వైసీపీ కార్యాలయంలో మంగళవారం అనుబంధ కమిటీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తల సేవలను గుర్తించేందుకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను నియోజకవర్గ స్థాయిలో పూర్తిచేస్తామని తెలిపారు. గ్రామ కమిటీలు, వార్డు కమిటీల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పార్టీ బలోపేతం కోసం అనుబంధ కమిటీల సమన్వయం ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రతి కార్యకర్త పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546